ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 09-10-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- దేవాలయాల పవిత్రతను కాపాడుకోవడం అందరి బాధ్యతని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రభుత్వం సమాన ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు.
- కాలుష్య నివారణకు సమగ్రమైన ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ వెల్లడించారు.
- "స్వర్ణాంధ్ర-2047" రూపకల్పనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని మంత్రి కందుల దుర్గేష్ కోరారు.
- క్రీడాకారుల కోసం ప్రత్యేక యాప్ ను అందుబాటులోకి తీసుకువస్తున్నామని ఆంధ్ర ప్రదేశ్ క్రీడా ప్రాధికారిత సంస్థ (శాప్) ఛైర్మన్ అనిమిని రవి నాయుడు తెలిపారు.

==================

దేవాలయాల పవిత్రతను కాపాడుకోవడం అందరి బాధ్యత అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. దసరా శరన్నవరాత్రులలో భాగంగా, విజయవాడలో ఇంద్రకీలాద్రి మీద వెలసిన కనకదుర్గమ్మ వారికి ఈ రోజు సతీసమేతంగా ఆయన పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో తిరుపతి తరువాత రెండవ అతిపెద్ద దేవాలయం దుర్గగుడి అని తెలిపారు. అమ్మ వారి దర్శనానికి వచ్చే సామాన్య భక్తులకు ఈసారి పెద్దపీట వేశామని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

కాగా, అంతకు ముందు దుర్గమ్మ ఆలయానికి చేరుకున్న ముఖ్యమంత్రికి ఆలయ అర్చకులు, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

===================

సంక్షేమంతో పాటు అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సమాన ప్రాధాన్యత ఇస్తోందని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. విజయనగరం జిల్లా కేంద్రంలోని ఘోషా ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన “అన్న” క్యాంటీన్‌ను స్థానిక శాసన సభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతి రాజులతో కలసి ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ... జిల్లాలో అవసరమైన చోట కొత్తగా “అన్న” క్యాంటీన్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఘోషా ఆసుపత్రిలోని భవనాన్ని సుమారు 35 లక్షల రూపాయలతో ఆధునీకరించామని వివరించారు. ఆసుపత్రిని అభివృద్ధి చేయడంతో పాటు విస్తరించడానికి కృషి చేస్తున్నామని మంత్రి తెలియజేశారు.

===================

రాష్ట్రంలో కాలుష్య నివారణకు సమగ్రమైన ప్రణాళికలు అవసరమని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అన్నారు. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించే అంశంపై విజయవాడలో ఈ రోజు నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ... కాలుష్యాన్ని నియంత్రించే విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ కోసం నిపుణులు, అనుభవజ్ఞుల సలహాలు ఎంతో అవసరమని పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

===================

స్వర్ణాంధ్ర-2047 రూపకల్పనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కోరారు. రాజమహేంద్రవరంలో ఈ రోజు “వికసిత్ భారత్”, “స్వర్ణాంధ్ర – 2047”, జిల్లా స్థాయి విజన్ గురించి వివిధ వర్గాల నుండి సలహా సూచనలు సేకరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ స్థాయిలో వికసిత్ భారత్, రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో స్వర్ణాంధ్ర 2047 పేరులో కార్యాచరణను చేపడుతున్నామని తెలిపారు. విద్య, వైద్య ఆరోగ్య రంగాలకు పెద్దపీట వేసేందుకు వివిధ రంగాల్లోని ప్రతి ఒక్కరి భాగస్వామ్యం కావాలన్నారు. రాష్ట్ర స్థాయిలో విజన్ పత్రం రూపొందించడానికి క్షేత్రస్థాయిలో పరిగణలోకి తీసుకున్న పలు అంశాలను పంపడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ పి. ప్రశాంతి, శాసన సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, వివిధ రంగాల్లోని నిపుణులు పాల్గొన్నారు.

===================

క్రీడాకారుల కోసం ప్రత్యేక యాప్ ను అందుబాటులోకి తీసుకువస్తున్నామని ఆంధ్ర ప్రదేశ్ క్రీడా ప్రాధికారిత సంస్థ (శాప్) ఛైర్మన్ అనిమిని రవి నాయుడు తెలిపారు. విజయవాడలోని శాప్ కార్యాలయంలో శాప్ ఎండీ పీఎస్ గిరీషా నిర్వహించిన సమీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్రంలో క్రీడాకారుల నమోదు నుంచి మెడల్స్, సర్టిఫికెట్ల జారీ, ప్రోత్సాహల వరకూ అన్ని వివరాలూ యాప్ లో ఎప్పటికప్పుడు పరిశీలించుకునేలా రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. కాగా, రాష్ట్రంలో ఎక్కడా కూడా శాప్ ఆస్తులు దుర్వినియోగం కాకుండా వివరాలు ఆన్ లైన్ లో పొందుపరుస్తున్నామని ఆయన అన్నారు.

విరామం

===================

ఫిషింగ్ హార్బర్ ఆధునీకరణలో భాగంగా గతంలో పలు జెట్టీల వద్ద మునిగిపోయిన ఫిషింగ్ ట్రాలర్లు, పడవల శిథిలాలను తొలగించే ప్రక్రియ విశాఖపట్నం పోర్ట్ అథారిటీ ఆధ్వర్యంలో చురుగ్గా సాగుతోందని అధికారులు తెలిపారు. స్థానిక మత్స్యకారుల సహాయంతో 6 ఫిషింగ్ ట్రాలర్లు, 11 బోట్లు సముద్రం అడుగున మునిగిపోయినట్లు ఇప్పటివరకూ

గుర్తించారు. దీనిపై మరింత సమాచారాన్ని విశాఖపట్నం నుంచి ఆకాశవాణి ప్రతినిధి వి.సత్యనారాయణ మూర్తి అందిస్తారు.

(వాయిస్ 34 సెకన్లు)

===================

పోస్టల్ రంగంపై అవగాహన కల్పించడానికి ప్రతీ సంతవ్సరం అక్టోబర్ 9న అంతర్జాతీయ తపాలా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని విజయవాడ పోస్ట్ మాస్టర్ జనరల్ డి.ఎస్.వి.ఆర్. మూర్తి తెలిపారు. సామాజిక, ఆర్థిక అభివృద్ధికి తపాలా రంగం అందిస్తున్న భాగస్వామ్యాన్ని ప్రతి ఒక్కరికీ గుర్తు చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వెల్లడించారు. విజయవాడలో ఈ రోజు పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ... పోస్టల్ ఉత్పతులపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఇంటి వద్దకే బ్యాంకింగ్ సేవలతో పాటు, పొదుపు ఖాతాలకు నెట్ బ్యాంకింగ్, ఏటీఎం సౌకర్యాలను కల్పిస్తున్నామని వివరించారు.

===================

దసరా పండుగను పురస్కరించుకుని విజయవాడ నుంచి శ్రీకాకుళం రోడ్డు వరకు రెండు రైళ్ళను నడుపుతున్నామని దక్షిణమధ్య రైల్వే శాఖ అధికారులు ప్రకటించారు. ఈ రోజు నుండి 17వ తేదీ వరకూ ఈ రైళ్లు నడపనున్నారు. ఈ రైళ్లు ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమహేంద్రవరం, ద్వారపూడి, అనపర్తి, సామర్లకోట, అన్నవరం, తుని, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, పొందూరు స్టేషన్లలో ఆగుతాయని అధికారులు వెల్లడించారు. ఈ రైళ్లల్లో ఏసీ త్రీ టైర్ కోచ్‌లు, స్లీపరు క్లాస్ కోచ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు.

===================

దిగువ ట్రోపో ఆవరణంలో తూర్పు ఆగ్నేయ దిశగా వీస్తున్న గాలుల ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాలలో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆ వివరాలను వాతావరణ కేంద్రం అధికారిణి తెలియచేస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

===================

విజయవాడ ఇంద్రకీలాద్రిపైన వెలసిన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. 7వ రోజైన ఈ రోజు అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి జన్మనక్షత్రం మూలా నక్షత్రం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దసరా ఉత్సవాల సందర్భంగా అన్ని క్యూలైన్లలో ఉచితంగా దర్శనం కల్పించారు. భక్తుల రద్దీ దృష్టిలో ఉంచుకుని పోలీసులు అవసరమైన బందోబస్తు చర్యలు చేపట్టారు. కాగా, ఉమ్మడి కర్నూల్ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రం శ్రీశైలంలో దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.

===================

మద్యం దుకాణాల లైసెన్సుల కోసం దరఖాస్తులు చేసుకునేందుకు ఈ నెల 11వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం గడువుని పొడిగించింది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా ఉత్తర్వులు జారీ చేశారు. దరఖాస్తులను 11వ తేదీన సాయంత్రం 5 గంటలలోగా పంపించాలని కోరారు. 14వ తేదీన డ్రా తీయనున్నామని, 16వ తేదీ నుంచి కొత్త మద్యం దుకాణాలు ప్రారంభం కానున్నాయని అధికారులు తెలిపారు.

===================

అర్హత కలిగిన రైతులందరకి కిసాన్ క్రెడిట్ కార్డులను అందించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ రోజు కలెక్టరేట్ నుండి ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారులు, జిల్లా వ్యవసాయాధికారులతో దృశ్య మాధ్యమం ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో సాగు చేస్తున్న కాఫీ, ఉద్యానవన తోటలు, జీడి తోటలు, రబ్బరు తోటల గురించి తెలుసుకున్నారు. అలాగే, మిరియాలు సాగులో రైతులు పొందుతున్న ఆదాయం, మార్కెటింగ్ సదుపాయాలు, గిట్టుబాటు ధరలపై కలెక్టర్ సమీక్షించారు. రైతులకు గిట్టుబాటు ధరలు అందించడానికి అవసరమైన చర్యలపై అధికారులతో చర్చించారు.

===================

===================